## మళ్లీ కోరలు చాస్తున్న కరోనా




**విజృంభిస్తున్న జేఎన్1 వేరియంట్.. మరోసారి వ్యాపిస్తున్న కరోనా మహమ్మారి**
**మాస్కులు ధరించాలి.. అప్రమత్తతే ఆయుధమంటున్న వైద్యులు**

కరోనా మహమ్మారి మళ్లీ కోరలు చాస్తున్నది. రెండేండ్ల కిందట దేశమే అతలాకుతలమైన విషయం తెలిసిందే. సెకండ్ వేవ్‌లో ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారు. అదే వైరస్ రూపాంతరం చెంది కొత్తకొత్త వేరియంట్లుగా పరిణతి చెందుతున్నది. ప్రస్తుతం జేఎన్ 1 వేరియంట్ వేగంగా వ్యాపిస్తున్నది. కరోనా బారినపడకుండా ఉండాలంటే అప్రమత్తతే ఆయుధమని వైద్యులు పేర్కొంటున్నారు. మాస్కులు ధరించి, భౌతికదూరం పాటించాలని సూచిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొంటున్నారు.

# బీ అలర్ట్

యాలాల, డిసెంబర్ 27 : కరోనా మహమ్మారి మరోసారి వేగంగా వ్యాపిస్తున్నది. ఈ మధ్య కాలంలో కేరళలో బయటపడ్డ కొత్త వేరియంట్ జేఎన్ 1 జెట్ స్పీడ్‌తో దేశవ్యాప్తంగా విస్తరిస్తుండడంతో వ్యాప్తి పెరుగుదలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. చిన్నారులు సైతం ఈ కరోనా బారినుంచి తప్పించుకోలేకపోతున్నారు. కరోనాతో కేరళలో ఒకరు మృతి చెందారు. మూడు రోజుల కింద 14 నెలల చిన్నారికి కొవిడ్ నిర్ధారణ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా నిలోఫర్‌లో మరో కేసు నమోదైంది. జ్వరం, ఫ్లూ వంటి లక్షణాలతో దవాఖాన చికిత్స పొందుతున్న 51 మంది రక్త నమూనాలను కొవిడ్ పరీక్షలకు పంపగా ఆరు నెలల చిన్నారికి పాజిటివ్ వచ్చింది. చిన్నారికి ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నామని, ఆరోగ్యం క్రమంగా కుదుట పడి కోలుకుంటుందని వైద్యులు పేర్కొన్నారు. తాజాగా హైదరాబాద్‌లో 9, కరీంనగర్‌లో 1 కరోనా కేసులతో కలుపుకొని తెలంగాణలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 55కు చేరిందని తెలంగాణ డీహెచ్ రవీంద్ర నాయక్ ఓ కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో కొత్త వేరియంట్ ఒమిక్రాన్ జేఎన్1 కేసులు నమోదు కాలేదని తెలిపారు.



### డేంజర్ బెల్స్ మోగిస్తున్న వైరస్..

భారత్‌లో కరోనా మళ్లీ విజృంభిస్తున్నది. గడిచిన 24 గంటల్లో (సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు) 116 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రోజురోజుకూ పాజిటివ్ కేసులు పెరుగడంతో ఆయా రాష్ట్రాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దేశంలో కొత్తగా నమోదైన కేసులతో కలిపి యాక్టివ్ కేసుల సంఖ్య 4,170కి చేరింది. ఇక అత్యధికంగా కేరళలో 3,128 కేసులు నమోదైనట్లు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రకటించింది. కర్ణాటకలో మొత్తం 344 యాక్టివ్ కేసులున్నాయి. వీరిలో 34 మందికి తాజాగా జేఎన్ 1 వేరియంట్ సోకగా, ముగ్గురు మృతి చెందారు. కరోనా తెలుగు రాష్ట్రాల్లో కూడా విస్తరిస్తున్నది. 24 గంటల్లో తెలంగాణలో 10 పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఏపీలో 29 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గడచిన రెండు రోజుల్లో తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలోనే 4 పాజిటివ్ కేసులు నమోదవడంతో జిల్లా దవాఖానలో కరోనా స్పెషల్ వార్డును ఏర్పాటు చేశారు. అటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకే కుటుంబంలో ఐదుగురికి వైరస్ సోకడంతో... హోమ్ క్వారంటైన్‌లో ఉన్నారు. దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతుండడంతో వైద్య అధికారులు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు.

### జేఎన్1 అత్యంత ప్రమాదకారా ?

రెండు సంవత్సరాల కింద కరోనా పేరు వింటేనే మనలో ఏదో అలజడి. పోయిన ప్రాణాలకు లెక్కేలేదు. అనంతరం రూపాన్ని, స్వభావాన్ని మార్చుకొన్నా వైరస్ 2021లో ఒమిక్రాన్ రూపంలో, ఉపవేరియంట్లుగా ప్రజలపై పెద్దగా ప్రభావం చూపలేదు. కరోనా ఉప వేరియంట్ అయిన ఒమిక్రాన్ కుటుంబానికి చెందిన బీఏ 2.86 నుంచి వచ్చిన మరో ఉపవేరియంట్ జేఎన్ 1 ప్రస్తుతం దేశంలో అలజడి సృష్టిస్తుంది. చాపకింద నీరులా వ్యాపిస్తుంది. జేఎన్1 ను మొదట ఫ్రాన్స్‌లో, అనంతరం అమెరికాలో గుర్తించారు. మన భారత్‌లో దీని ప్రభావం మధ్యస్తం అని చెప్పుకోవచ్చు. జేఎన్ 1 వైరస్‌కు గ్రోత్, ఎస్కేప్ శక్తి ఎక్కువ. అంటే వేగంగా వ్యాపించే స్వభావంతో పాటు యాంటీబాడీస్‌ను, రోగ నిరోదక శక్తిని అధిగమించే శక్తి కొంత ఎక్కువగానే ఉన్నాయి. జేఎన్1 అనేది బీఏ 2.86కు ఉపవేరియంట్ కావడంతో.. దీన్ని ఆర్టీపీసీఆర్ టెస్టులో నిర్ధారించలేం. జీనోమ్ సీక్వెన్సింగ్ చేయాల్సిందే.

### హైరిస్క్.. లోరిస్క్..


గతంలో వైరస్‌కు సంబంధించి హైరిస్క్ 50 శాతానికి పైగా ఉండేది. ఇప్పుడు అది 6 శాతానికి పడిపోయింది. మిడిల్ రిస్క్ 3 శాతం, లోయర్ రిస్క్ 0.5 శాతంగా ఉన్నది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, అవయవ మార్పిడి చేయించుకొన్న వాళ్లు, ఆటో ఇమ్యూన్ సమస్యతో బాధ పడుతున్నవారు హైరిస్క్‌లో ఉన్నరన్న విషయాన్ని గుర్తించుకోవాలి. వీరు మరింత జాగ్రత్తగా ఉండడమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తగిన చికిత్స చేయించుకోవాలి. జేఎన్1 విషయంలో పిల్లలు లో రిస్క్ పరిధిలోనే ఉన్నప్పటికీ శ్వాసకోశ సమస్యలు, గుండె రుగ్మతలు ఉన్న పిల్లలూ చాలా జాగ్రత్తగా ఉండాలి.


### ఈ సీజనల్ లక్షణాలే అధికం..

ప్రస్తుతం నమోదవుతున్న జేఎన్1 కరోనా వేరియంట్‌లో సాధారణ జలుబు, ముక్కు కారడం, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు, తలనొప్పి, నీరసం, కడుపునొప్పి, కళ్లు ఎర్రబడటం వంటి సీజనల్ లక్షణాలే కనిపిస్తుంటాయి. అందువల్ల ఈ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

### ఆరోగ్య సలహాలు, జాగ్రత్తలు..

జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలుంటే జాగ్రత్తగా ఉండాలి. కరోనా లక్షణాలు ఎక్కువగా ఉంటే దవాఖానకు వెళ్లాలి. జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మాస్కు వాడితే మంచిది. భౌతిక దూరం పాటించడం, చేతులను ఎప్పటికప్పుడు శానిటైజ్ చేసుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం.







ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పరిమళ పత్రీ, పిరమిడ్ ట్రస్టు సభ్యులు


ప్రాతఃకాల ధ్యానంలో పాల్గొన్న ధ్యానులు

# ధ్యానంతో జ్ఞానం





**మనిషి భయం లేకుండా బుద్ధుడివలే జీవించాలి**
**మనలో మనం కలిసిపోవడమే ధ్యాన యోగం**
**పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిమళ పత్రీ**
**కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం సభలు**
**ఆకట్టుకుంటున్న ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు**

కడ్తాల్, డిసెంబర్ 27 : 'మనలో మనం కలిసిపోవడమే ధ్యాన యోగం, ధ్యానంతో అపారమైన జ్ఞానం లభిస్తుంది.. ప్రతి మనిషి భయం లేకుండా బుద్ధుడివలే జీవించాలి..' అని సుభాశ్ పత్రీజీ కోరుకున్నారని పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిమళ పత్రీ అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో, పిరమిడ్ స్పిరిచ్చువల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు ఏడో రోజుకి చేరాయి. బుధవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల ధ్యానంలో ధ్యానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రీ మాట్లాడారు. సత్యం తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉన్నవాళ్లే పిరమిడ్‌లోకి వస్తారని తెలిపారు. సుభాశ్ పత్రీజీ సత్యాలు మాట్లాడేవారని, ధ్యానులకు సత్యం, అహింసా మార్గాలను చూపించారన్నారు. మనిషి తీవ్ర ఆలోచనలతో మానసిక ఒత్తిడికి గురవుతున్నాడని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకున్నప్పుడే పరిపూర్ణుడవుతాడన్నారు. ప్రముఖ హిందూ ధర్మం ప్రచారకులు రాధామనోహర్ మాట్లాడుతూ ప్రతి మనిషి సకల ప్రాణకోటి కోసం, వాటి స్వేచ్ఛ కోసం పాటుపడాలన్నారు. శ్వాస మీద ధ్యాసతో శక్తి లభిస్తుందన్నారు. మనల్ని మనం తెలుసుకోవడమే ఆత్మజ్ఞానమన్నారు. ధ్యానంతో జ్ఞానం కలుగుతుందని, మనిషి ఆయుష్షు శ్వాసపైనే ఆధారపడి ఉందన్నారు. సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ ధర్మం, వృక్షం రెండు కాపాడబడితే జీవన ప్రయాణం సాఫీగా సాగుతుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదన్నారు. పుడమిపై చెడు నశించి సత్యం జయించాలని చెప్పారు. పత్రీజీ అందించిన ధ్యానం గొప్పదని, పత్రీజీ భౌతికంగా లేకపోయిన ప్రతి ధ్యానిలో ఆయన ఉన్నారన్నారు. ధ్యాన మహాయాగ సభలను అద్భుతంగా నిర్వహిస్తున్న విజయభాస్కర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ధ్యాన యాగంలో ప్రతి రోజూ నిర్వహిస్తున్న కళాకారుల నృత్య ప్రదర్శనలు ధ్యానులను అలరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు బాలకృష్ణ, సాంబశివరావు, హనుమంతురాజు, రాంబాబు, శ్రీరామ్‌గోపాల్, శివప్రసాద్, దామోదర్‌రెడ్డి, మాధవి, లక్ష్మి, నవకాంత్, ధ్యానులు పాల్గొన్నారు.

# జనవరి 1 నుంచి నుమాయిష్

- 46 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్
- దాదాపు 2400 స్టాళ్ల నిర్మాణం
- కొలువుదీరనున్న పారిశ్రామిక ఉత్పత్తులు, ఫుడ్ కోర్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కులు
- వేగంగా కొనసాగుతున్న స్టాళ్ల నిర్మాణ పనులు
- విజయవంతంగా నిర్వహించేందుకు సొసైటీ ప్రతినిధులు కృషి
- విద్యావ్యాప్తికి కృషి చేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ

అబిడ్స్, డిసెంబర్ 27 : దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారైన పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు చేపట్టేందుకు నగరంలో నిర్వహించనున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్) ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నిర్వహిస్తారు. ఇందులో దాదాపు 2400 స్టాళ్ల నిర్మాణం చేసేందుకు నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు స్టాళ్ల కేటాయింపు చివరి దశకు చేరుకుంది. ఇప్పటి వరకు స్టాళ్లను పొందిన నిర్వాహకులకు స్టాళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జనవరి 1 ప్రారంభం నాటికి దాదాపు అన్ని స్టాళ్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలో సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి ఈ.రాజేందర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 1938 సంవత్సరంలో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నేతృత్వంలో ప్రారంభమైన ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన అప్పట్లో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించే వారు. ఆ తరువాత 1946లో నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలోని 26 ఎకరాల సువిశాలమైన స్థలంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌కు దేశ, విదేశాల్లో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు ప్రజాదరణ ఉంది. దీంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం లభించడంతో వాటి విక్రయాలకు కేంద్రంగా నిలిచింది. ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. సుమారు 2400 స్టాళ్ల ఏర్పాటుతో కొనసాగే ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలనే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సందర్శనకు వచ్చే వారిని అలరిస్తోంది. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో కొలువుదీరనున్నాయి. ఇప్పటికే దాదాపు స్టాళ్ల కేటాయింపులు పూర్తి కావస్తుండటంతో పలు స్టాళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.


స్టాల్ నిర్మాణ పనులను చేపడుతున్న కార్మికులు

### ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసేందుకు చర్యలు..

మొత్తం 32 సబ్ కమిటీలను ఏర్పాటు చేసి ఆయా కమిటీల సహకారంతో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసేందుకు సొసైటీ ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రవేశ రుసుము గత సంవత్సరం మాదిరిగానే రూ.40 నిర్ణయించడంతో పాటు క్షణాల్లో ఎగ్జిబిషన్‌ను చుట్టుముట్టి వచ్చేందుకు ఏర్పాటు చేసిన మినీ ట్రైన్‌కు రూ.30 ధరను నిర్ణయించారు. గత సంవత్సరం దాదాపు 25 లక్షల వరకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించగా, ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువ మంది సందర్శకులు తరలి వచ్చేలా సొసైటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

### రాష్ట్రంలో మహిళా విద్యా వ్యాప్తికి కృషి

ఎగ్జిబిషన్ నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేస్తోంది. ముఖ్యంగా మహిళా విద్యా వ్యాప్తికి గాను మహిళా కళాశాలలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను స్థాపించింది. పలు జిల్లాల్లో ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో 20 విద్యా సంస్థలు కొనసాగుతున్నాయి. ఏటా ఆయా విద్యా సంస్థల ద్వారా దాదాపు 30 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



ఎగ్జిబిషన్ ప్రధాన మార్గం


ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తున్న అమ్యూజ్‌మెంట్ పార్క్